సాక్షి నిర్మల్

బుధవారం । 1 । మే । 2024

'ఆయన' గెలిచారు.. ఆమెకు తెలియదు



నాడు మధుసూదన్‌రెడ్డి ఆదిలాబాద్ ఎంపీగా ఎన్నికవగా అప్పటికే ఆయన భార్య కోమాలో ఉంది. మూడేళ్ల తర్వాత అదే స్థితిలో మృతి చెందింది. IIలో▸

రూ.4.31లక్షల నగదు పట్టివేత



మండలంలోని మిర్జాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.31 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.5 /27.5

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి వేడి పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌కు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నిర్మల్ టౌన్: రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు మే 1, 2 తేదీల్లో వనపర్తి జిల్లా కేంద్రంలో జరగనున్నాయి. ఈ పోటీలకు నిర్మల్ జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎల్. నాగలక్ష్మి 32 కేజీలు లైట్ కాంటాక్ట్, కె.సాహితీ 37 కేజీలు లైట్ కాంటాక్ట్, కె.దివ్య 32 కేజీలు ఫైన్‌ఫైట్, జె.సుగంధ 45 కేజీలు కిక్‌లైట్, ఎం.అక్షయ 42 కేజీలో పాయింట్, ఎల్.సుజల 53 కేజీలో కిక్ లైట్, సీహెచ్.నక్షత్ర 70 కేజీలో లైట్ కాంటాక్ట్, ఆర్.స్వాతి 40 కేజీలో పిక్ లైట్, బి.గీతాంజలి 42 కేజీల పాయింట్ ఫైవ్, ఎం.శశివర్ధన్ 72 కేజీల లైట్ కాంటాక్ట్‌లలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జిల్లా క్రీడల అధికారి నర్సయ్య అభినందించారు.

'పది' ఫలితాలపై హర్షం



డీఈవోను అభినందిస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా రెండోసారి మొదటి స్థానం కైవసం చేసుకోవడంతో ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు పీఆర్టీయూ, ఎస్టీయూ, టీఎస్ యూటీఎఫ్, టీయూటీఎఫ్, పీఆర్టీయూ టీఎస్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా పరీక్షల అధికారి పద్మను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో ప్రత్యేక చొరవతో ఈ ఫలితం వచ్చిందన్నారు. ప్రత్యేక ప్రణాళిక, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, రెండుసార్లు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు.

ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లు

- 3 నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందస్తుగా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయం, ఆసిఫాబాద్‌కు సంబంధించి అక్కడి ఆర్డీవో కార్యాలయం, ఖానాపూర్‌కు ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయం, ఆదిలాబాద్‌కు పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల శాంతినగర్, బోథ్ నియోజకవర్గానికి బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిర్మల్‌కు అక్కడి ఆర్డీవో కార్యాలయం, ముధోల్ నియోజకవర్గానికి సంబంధించి భైంసా ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ఈ నెల 3 నుంచి 8వరకు ఆయా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఇబ్బందులు కలుగకుండా ఆయా కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేస్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు.

మళ్లీ నం.1



10 జీపీఏ సాధించిన విద్యార్థులతో డీఈవో రవీందర్‌రెడ్డి

- జిల్లాస్థానం 'పది'లం!
- ఎస్సెస్సీ ఫలితాల్లో మనమే టాప్
- వరుసగా రెండో ఏడాది రాష్ట్రంలో ఫస్ట్
- 99.05 శాతం ఉత్తీర్ణత..
- గతేడాదికి మించి ఫలితాలు
- సత్తాచాటిన సర్కారు స్కూళ్లు

నిర్మల్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థానం పదిలంగా ఉంది. గతేడాది రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. మంగళవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఈసారి గతేడాది మించిన ఉత్తీర్ణత శాతంలో రికార్డు సృష్టించింది. ఫలితాల్లో వరుసగా రెండో ఏడాది రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. ఏకంగా 99.5 ఉత్తీర్ణత శాతంతో ప్రథమ స్థానాన్ని మరింత మెరుగు పర్చుకుంది. బాసర సరస్వతమ్మ ఆశీస్సులతో రెండేళ్లుగా జిల్లా సత్తా చాటుతోంది. చదువుల తల్లి కొలువైన జిల్లా రెండేళ్లుగా అత్యుత్తమ మార్కులనూ సాధిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి విడిపోయిన తర్వాత నిర్మల్ విద్యారంగంలో దిన దినాభివృద్ధి చెందుతోంది. ఉపాధ్యాయ బృందం ప్రణాళిక, విద్యార్థుల పట్టుదల వెరసి జిల్లాను రాష్ట్రంలో ఫస్ట్ ప్లేస్‌లో నిలబెట్టాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులు సైతం సత్తా చాటాయి. కార్పొరేట్ స్థాయిలో ఫలితాలు సాధించాయి. విద్యార్థుల పట్టుదలకు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోడై జిల్లాలో 99.05% మంది పాసయ్యారు. గతేడాది కూడా 99% తో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువగా ఈసారి కూడా మొదటి 'స్థానం' నిలబెట్టుకుంది.

వరుసగా రెండోసారి..

పదో తరగతి ఫలితాల్లో జిల్లా వరుసగా రెండోసారి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించారు. మూల్యాంకనం వివిధ కేంద్రాలలో ఏప్రిల్ 6 నుంచి 9 రోజులపాటు చేపట్టారు. ఈసారి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు కొత్త రికార్డు నెలకొల్పారు. మొత్తం 8,908 మంది విద్యార్థులకుగాను 8,823 మంది(99.05) విద్యార్థులు పాసయ్యారు. 85 మంది ఫెయిలయ్యారు. బాలురు 4,300 మందికిగాను 4,246 మంది(98.74%)పాసవగా, 4,608 మంది బాలికలకు 4,577(99.33%)మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 9,071 మంది విద్యార్థులకు 8,980 మంది(99%) పాసవగా అప్పుడు కూడా జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.

ఫలించిన ప్రణాళిక...

జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి ప్రణాళిక ప్రకారం పని చేయడంతో రెండోసారి కూడా ఫలితాల్లో జిల్లా అగ్రస్థానాన నిలిచింది. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాల కోసం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. డిసెంబర్ నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తిచేసి, కఠిన అంశాలపై పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో రోజుకు ఓ సబ్జెక్టు టీచర్‌తో ప్రత్యేక పాఠాలు, రివిజన్, స్లిప్ టెస్టులు నిర్వహించారు. రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించి ఆ ఫలితాలను బట్టి విద్యార్థులను ప్రత్యేక కేటగిరీలుగా విభజించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. వివిధ ఎన్జీవో సంఘాలు, తల్లిదండ్రులు, ఇతరవర్గాల నుంచి విరాళాలు సేకరించి ప్రతీరోజు ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులకు రాగిజావ, స్నాక్స్ అందించారు. గతేడాది లాగే ఈసారి కూడా ఆరు పరీక్షలు మాత్రమే ఉండడంతో విద్యార్థులకు సమయాభావం కలిసి వచ్చి సబ్జెక్టుపై పట్టు వచ్చిందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. రెండోసారి కూడా జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడంతో పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



కేక్ కట్‌చేసి కలెక్టర్‌కు తినిపిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు

కలెక్టరేట్‌లో సంబురాలు..

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రథమ స్థానం రావడంతో కలెక్టరేట్‌లో సంబురాలు నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేశారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. వరుసగా రెండోసారి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన డీఈవో, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మరింత ఉత్సాహంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

సత్తాచాటిన సర్కార్ బడులు..

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడులు సత్తా చాటాయి. జిల్లాలో మొత్తం 165 ప్రభుత్వ బడులు ఉండగా 13 పాఠశాలల్లో 100% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 6,037 మంది విద్యార్థులకు 5,964 మంది(98.79) పాసయ్యారు. ఇందులో 2,727 మంది బాలురకు 2,683 మంది పాసవగా 3,310 మంది బాలికలకు 3,281 మంది పాసయ్యారు. జిల్లా వ్యాప్తంగా 95 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ఇక జిల్లాలోని 18 కేజీబీవీలో 17 పాఠశాలలు 100 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. అదేవిధంగా కుంటాల మోడల్ స్కూల్లో, అన్ని మైనారిటీ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలలో 100% ఉత్తీర్ణత నమోదయింది. ఇక 65 ప్రైవేట్ హైస్కూల్స్ ఉండగా ఇందులో 2,828 మంది విద్యార్థులకుగాను 2,821 మంది విద్యార్థులు పాసయ్యారు. బాలురు 1,539 మందికి 1,534 మంది, బాలికలు 1,289 మందికి 1,287 మంది పాసయ్యారు.

మైక్రో అబ్జర్వర్స్ పాత్ర కీలకం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమైందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకులకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల విధుల్లో సూక్ష్మ పరిశీలకులు(మైక్రో అబ్జర్వర్స్) అప్రమత్తంగా తమ విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహించే టప్పుడు ప్రతీ చిన్న అంశాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనధికార వ్యక్తులు ఎవరూ కుడా పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీఆర్‌సీ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతనే పోలింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్లలోపు ఎటువంటి రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లు ఉండకుండా చూడాలన్నారు. ఎన్నికల అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన సమాచారాన్ని ఫ్లెక్సీల రూపంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని అంశాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అన్ని రిపోర్టులను సకాలంలో అందజేయాలని ఆదేశించారు. అనంతరం సూక్ష్మ పరిశీలకులకు మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమాలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలకు సంబంధించి ఎంసీఎంసీ కమిటీ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రాజకీయ పార్టీల నేతలను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ప్రచార సమయంలో స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లకు, ఓటింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగ ఓటర్ల కోసం హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 38 శాతం ఓటర్ గుర్తింపు స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగ్‌రావ్, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, జిల్లాలోని ఆయా రాజకీయ పార్టీల నేతలు శ్రావణ్‌రెడ్డి, సిరికొండ రమేశ్, నరేశ్, అధికారులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అభినందనలు

నిర్మల్‌చైన్‌గేట్: పదో తరగతి ఫలితాల్లో, ఈనెల 24న విడులైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అత్యధికంగా 99.09 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో, అభయ హస్తంలో విద్యాజ్యోతుల పథకం కింద ఇంటర్మీడియట్ పాస్ అయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.15 వేలు, పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

డీసీసీ అధ్యక్షుడి శుభాకాంక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: మంగళవారం విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానం పొందడంపై డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు హర్షం వ్యక్తం చేశారు. వరుసగా రెండో సంవత్సరం మొదటి స్థానం కైవసం చేసుకోవడం అభినందనీయన్నారు. విద్యార్థుల నిరంతర కృషి, ఉపాధ్యాయులు, జిల్లా అధికారుల సమష్టి బాధ్యత ఈ విజయానికి కారణమన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

పదో తరగతి ఫలితాల్లో వరుసగా రెండవసారి రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానం సాధించిన సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఎస్‌యూఐ ఆదిలాబాద్ ఇన్‌చార్జి అనిల్, జిల్లా అధ్యక్షుడు అంబడి రాకేశ్, అసెంబ్లీ అధ్యక్షుడు సయ్యద్ తాజ్ పాల్గొన్నారు.

నీటిబొట్టు.. ఇంకేట్టు!

- ఇంకుడు గుంతలపై ప్రభుత్వం దృష్టి
- మున్సిపాలిటీల్లో 350 గజాలు దాటిన నిర్మాణంలో తప్పనిసరి
- కాలనీల్లో లెక్కలు తీస్తున్న మున్సిపల్ సిబ్బంది
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు



ఇంకుడు గుంతల నిర్మాణంపై పట్టణంలో అవగాహన కల్పిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాభావ పరిస్థితుల వల్ల రోజురోజుకూ భూగర్భజల మట్టం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇంటికో ఇంకుడు గుంత నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం పాతదే అయినా, కొద్ది రోజులు దీనిపై పట్టింపు కరువైంది. తాజాగా దీని అమలుపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఆరుబయట, ఇళ్ల ప్రహరీ లోపల, బోర్ల పక్కన ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భూగర్భ జలం పెరుగుతుంది. ఇంట్లో వినియోగించే నీటిని ఒడిసి పడితేనే నీటి ఎద్దడిని అధిగమించే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతలపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

2018లో ప్రభుత్వం ప్రతీ జిల్లా బడులు, భారీ భవన సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టారు. కానీ అనేక చోట్ల గుంతల నిర్మాణం అటకెక్కింది. నిర్మించిన ఇంకుడు గుంతల్లో పిచ్చి మొక్కలు, పూడికతో నిండిపోయాయి. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 350 చదరపు మీటర్లు కలిగిన ప్రతీ నిర్మాణానికి ఇంకుడు గుంత ఉండేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. లేకుంటే రెండు వారాల్లో నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇల్లు నిర్మించుకున్నాకే చెల్లింపులు..

ఇంటి నిర్మాణం పూర్తయ్యాక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నామని యజమాని దరఖాస్తు చేసుకుంటే ఆ డబ్బులను వారి ఖాతాల్లో జమచేస్తారు. మున్సిపాలిటీల్లో కమిషనర్ల అధ్యక్షతన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పట్టణ ప్రణాళిక అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. వీరంతా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితులపై నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

టీఎస్ బీపాస్ చట్టం ప్రకారం..

పట్టణాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలతో వర్షం నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. ఇళ్ల పైకప్పుల నుంచి పడిన వర్షం నీరు కూడా నేరుగా మురుగునీటి కాల్వల ద్వారా చెరువుల్లోకి వెళ్తుంది. టీఎస్ బీపాస్ చట్టం ప్రకారం ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలి. గుంతకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు మున్సిపల్ అధికారులు డిపాజిట్ తీసుకుంటారు.

యాప్ ద్వారా సర్వే...

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని ఇళ్ల సంఖ్య తేల్చేందుకు సీడీఎంఏ అధికారులు ప్రత్యేక యాప్ రూపొందించారు. యాప్ వినియోగంపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇంటింటి సర్వే సాగుతుండగా, 360 గజాల స్థలం కలిగిన ఇంటికి వెళ్లి యజమాని పేరు, ఇంటి నంబర్, స్థలం కొలతలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో సర్వే కొనసాగుతుంది. జిల్లాలోని 3 మున్సిపాలిటీల్లో 40,180 గృహాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఇళ్లల్లో మాత్రమే ఇంకుడు గుంతలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతలు ఎక్కడెక్కడ నిర్మించారో ప్రతీ ఇంటికి వెళ్లి ఈనెల చివరి వరకు సర్వే చేయనున్నారు. ఇంకుడు గుంత నిర్మించకుంటే ఎందుకు నిర్మించలేదో కారణాలు తెలుసుకుంటారు. నిర్మించుకునేందుకు ముందుకు వచ్చేవారికి అవగాహన కల్పిస్తారు.

ఇంకుడు గుంత తప్పనిసరి..



ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 350 గజాలు దాటిన నివాస, వాణిజ్య భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడుగుంత ఉండాలి. మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో పర్యటించి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు.

– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

ప్రశ్నించే గొంతుక అవుతా

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సక్కు

ఖానాపూర్: తనను గెలిపిస్తే తెలంగాణ ప్రాంత సమస్యలతోపాటు ఉమ్మడి జిల్లాలోని ప్రజాసమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతానని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై అత్యధికంగా ప్రశ్నించిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పార్లమెంట్ పరిధిలో 17 వేల ఓట్లు అధికంగా వచ్చాయన్నారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ వచ్చేలా ప్రజలు గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరెంట్ సక్రమంగా ఉండడం లేదని, రైతులకు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సోనియా గాంధీ జన్మదినం రోజు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అటవీ అనుమతులు రాక అభివృద్ధి కుంటుపడ్డప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. టైగర్‌జోన్ పేరుతో అభివృద్ధికి ఆటంకంగా మార్చారే తప్ప ప్రజాసమస్యలు పట్టించుకోలేదన్నారు. అత్యధిక వర్షపాతం ఉన్నప్పటికీ సాగునీరు అందించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనతో అన్నివర్గాల్లో నిరుత్సాహం ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్, నాయకులు మర్సకోల సరస్వతి, రాథోడ్ రామునాయక్, కల్వకుంట్ల నారాయణరావు, సక్కారం శ్రీనివాస్, టి.రాజగంగన్న, బీసీ రాజన్న, కొక్కుల ప్రదీప్, గౌరీకార్ రాజు, తోట సుమిత్, పెద్ది మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం కాంగ్రెస్ బూటకపు హామీలు

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

భైంసాటౌన్: అబద్ధపు పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోగా, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం కొత్తగా బూటకపు హామీలు ఇస్తూ మరోమారు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో కుభీర్, భైంసా మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500 సాయం హామీలు అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి తనను నమ్మాలంటూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. 420 హామీలకు ఎందరు దేవుళ్లపై ఒట్టు వేస్తారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, రాను న్న ఐదేళ్లు దేశానికి కీలకమని, కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం చారిత్రక అవసరమని అన్నారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గోడం నాగేశ్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నట్లు డీప్‌ఫేక్ సృష్టించి కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. మహిళా బిల్లుతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత బీజేపీదన్నారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కోఇన్‌చార్జి అశోక్ పాల్గొన్నారు.



ప్రతీ వాగ్దానం నెరవేరుస్తాం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నిర్మల్ రూరల్/సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ వాగ్దానం నెరవేరుస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కోరారు. నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి గ్రామంలో, సారంగాపూర్ మండలం ధని, సాయినగర్, బోరిగాం, జామ్, మలక్‌చించోలి, ప్యారమూర్ కంకెట, తాండ్ర(జి), బీరవెల్లి గ్రామాల్లో మంగళవారం ఆత్రం సుగుణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన మాటప్రకారం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు ఇచ్చిన 2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ఆడె సవిత, కాంగ్రెస్ సారంగాపూర్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు గాజుల రవి, కుంట పద్మాకర్, భోజన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆడబిడ్డను ఆదరించండి..

నర్సాపూర్(జి): ఆడబిడ్డను ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కార్నర్ మీటింగ్ లో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

క్లుప్తంగా

కోతుల దాడిలో బాలుడికి గాయాలు


బాలుడి కాలిపై గాయం

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని దేవాన్స్ అనే మూడేళ్ల బాలుడిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులతో పాటు అంగన్‌వాడీ టీచర్ ఆర్.విజయలక్ష్మి వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. విషయం తెలియడంతో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం


బంగారు పతకం, ట్రోఫీతో అక్షిత

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన అక్షిత జాతీయస్థాయి సౌత్ జోన్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ జట్టులో ఆదిలాబాద్ జిల్లా తరపున పోటీల్లో పాల్గొంది. 10–0 పరుగుల తేడాతో గెలుపొందిన తెలంగాణ జట్టు బంగారు పతకం సాధించింది. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన అక్షితను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, గన్నకంటి గంగాధర్, గొడం జ్యోతిరాం, తదితరులు అభినందించారు.

అనారోగ్యంతో హోంగార్డు ఆత్మహత్య


నూర్‌సింగ్(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని జైత్రంతాండ గ్రామానికి చెందిన హోంగార్డు జాదవ్ నూర్‌సింగ్ (46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఇంద్రవెల్లి పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న నూర్‌సింగ్ మూడు నెలలుగా అనారోగ్యం బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య సులోచన బాయి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తాలో గల జై శ్రీ ప్లైవుడ్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే కొద్ది పాటి ప్లైవుడ్ కాలిబూడిదైంది. షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలను ఫైర్ అధికారులు పరిశీలించారు. ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్‌స్టేషన్ అధికారి జయత్ రామ్ పేర్కొన్నారు. ఫైర్ సిబ్బంది ఎం.అశోక్ కుమార్, నగేష్, అరుణ్, హుస్సేన్‌షా పాల్గొన్నారు.

'ఆయన' గెలిచారు.. ఆమెకు తెలియదు


2004లో ఎంపీలు కేసీఆర్, ఆలె నరేంద్ర, వినోద్ కుమార్, రవీందర్ నాయక్‌లతో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

- ఎంపీగా మధుసూదన్‌రెడ్డి ఎన్నిక
- అప్పటికే ఆయన భార్య కోమాలో..
- మూడేళ్ల తర్వాత అదే పరిస్థితిలో మృతి


భార్య భూలక్ష్మితో మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: జీవితంలో ఎవరైనా ఏదైనా సక్సెస్ సాధిస్తే మొదట కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటారు.. అయితే మాజీ ఎంపీ మధుసూదన్‌రెడ్డికి మాత్రం ఈ సంతోషం పంచుకునేందుకు ఆ అవకాశం లేకుండా పోయింది.. ఆయన భార్య అప్పటికే విగత జీవి.. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైన తర్వాత కొద్ది రోజులకు ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కారులో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తుప్రాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాలపాలై కోమాలోకి వెళ్లిపోగా ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మార్చిలో ఈ ప్రమాదం జరగగా ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. మూడేళ్ల తర్వాత ఆయన ఎంపీగా ఉన్న కాలంలోనే ఆమె అదే పరిస్థితిలో ఈ లోకం విడిచి వెళ్లిపోయింది.

న్యాయవాద వృత్తి నుంచి..

ఆదిలాబాద్‌లో టి.మధుసూదన్‌రెడ్డి అప్పటికే దశాబ్దాలుగా ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. అప్పుడు 58 ఏళ్ల మధ్య వయస్సు.. భార్య భూలక్ష్మి, అప్పటికే పెళ్లిళ్లు జరిగిన కుమారుడు ప్రకాష్‌రెడ్డి, కూతురు సంగీత, మనుమలు, మనుమరాళ్లతో సంతోషంగా గడుపుతున్నారు. 2004లో ఆయనకు బీఆర్‌ఎస్ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టిక్కెట్ ఖరారైంది. మార్చి 1న ఆయన ఆదిలాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది కూతురి వివాహం హైదరాబాద్‌లో ఉండడంతో మధుసూదన్‌రెడ్డి భార్య భూలక్ష్మితో కలిసి కారులో డ్రైవర్‌తో సహా బయల్దేరి వెళ్లారు. అయితే మార్గమధ్యలో మధుసూదన్‌రెడ్డి కారు నడుపుతుండగా భార్య ముందర కూర్చుంది. డ్రైవర్ వెనుక సీటులో ఉన్నాడు. తుప్రాన్ వద్ద అనుకోని పరిస్థితిలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భూలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా మధుసూదన్‌రెడ్డికి మెడ వద్ద స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే భూలక్ష్మి కోమాలోకి వెళ్లిపోయింది. మధుసూదన్‌రెడ్డి చికిత్స అనంతరం తేరుకున్నారు. ఏప్రిల్ 20న 14వ లోక్‌సభ మొదటిదశ ఎన్నికలు జరిగాయి. మే 13న ఫలితాలు వెలువడ్డాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి 4,15,429 ఓట్లు, టీడీపీ అభ్యర్థి వేణుగోపాల్‌చారి 3,74,455 ఓట్లు సాధించారు. ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్‌రెడ్డి గెలిచారు. ప్రముఖ న్యాయవాదిగా తన విజయాన్ని చూసిన భాగస్వామి భూలక్ష్మి ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యారన్న విషయం కూడా తెలియకుండానే కోమాలోనే 2007లో ఆమె కన్ను మూశారు.

మొదటిసారి ఎన్నికల్లో..

బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) పార్టీ 2001 సంవత్సరంలో ఆవిర్భవించింది. 2004 సాధారణ ఎన్నికల్లో యూపీఏ భాగస్వామ్య పార్టీలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కలిసి రాష్ట్రంలో పోటీ చేసింది. కొత్త పార్టీగా ఆ ఎన్నికల్లో 26 అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లోనే ఆదిలాబాద్ ఎంపీగా మధుసూదన్‌రెడ్డి గెలిచారు. ఆ ఐదుగురు ఎంపీల్లో పార్టీ అధినేత కేసీఆర్ కరీంనగర్ నుంచి గెలుపొందగా మెదక్ నుంచి ఆలె నరేంద్ర, హన్మకొండ నుంచి బి.వినోద్ కుమార్, వరంగల్ నుంచి దరావత్ రవీందర్ నాయక్ ఉన్నారు. దేశంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ధ్యేయమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీకి ఉండగా, ఆ దిశగా యూపీఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందడుగు లేకపోవడంతో 2006లో బీఆర్‌ఎస్ యూపీఏ నుంచి వైదొలిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేశారు. అందులో మధుసూదన్‌రెడ్డి కూడా ఉన్నారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి తిరిగి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ నుంచి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. దీంతో కృంగిపోకుండా ఆయన తిరిగి న్యాయవాది వృత్తి చేపట్టడం గమనార్హం. 2015లో ఆయన గుండెపోటుతో మృతి చెందారు.

గురుకులాల్లో 98.91 శాతం ఉత్తీర్ణత

- ఆదిలాబాద్ రీజియన్‌లో 8 గురుకులాల్లో వందశాతం ఫలితాలు
- గతంలో కన్నా ఎంతో మెరుగు

బెల్లంపల్లి: పదోతరగతి వార్షిక ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు 98.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. రీజియన్ వ్యాప్తంగా 17 గురుకులాలు ఉండగా ఎనిమిదింటిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా 9 గురుకులాలు కేవలం 2 నుంచి 3 శాతం తేడాతో వందశాతం కోల్పోవాల్సి వచ్చింది. ఓవరాల్‌గా రీజియన్ నుంచి 1,287 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,273 మంది ఉత్తీర్ణులుకాగా కేవలం 14 మంది అనుత్తీర్ణులయ్యారు. గతంలో కన్నా భిన్నంగా ఈసారి సంక్షేమ గురుకులాలు 'పది' ఫలితాల్లో రాణించడం విశేషం.

వందశాతం సాధించిన గురుకులాలు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17 గురుకులాలు ఉన్నాయి. ఆదిలాబాద్‌లోని సీఓఈ బాలికల గురుకుల విద్యాలయం, ఇచ్చోడ బాలుర గురుకులం వందశాతం ఫలితాలు సాధించి సత్తా చాటాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో రెబ్బెన (బాలికలు), కాగజ్‌నగర్(బాలికలు), సిర్పూర్ (టీ) బాలుర గురుకులాలు శతశాతం ఫలితాలతో రాణించి జయకేతనం ఎగుర వేశాయి. మంచిర్యాల జిల్లాలోని జైపూర్, బెల్లంపల్లి (సీఓఈ), కోటపల్లి బాలుర గురుకులాలు మెరుగైన ఫలితాలతో మెరిశాయి.

మిగతా గురుకులాల్లో ఉత్తీర్ణత

బోథ్ సంక్షేమ బాలికల గురుకులంలో 97.40 శాతం, సిర్పూర్ (టీ) బాలికల గురుకులంలో 98.40 శాతం, లక్సెట్టిపేట బాలికల గురుకులంలో 97.37 శాతం, బెల్లంపల్లి బాలికల గురుకులంలో 98.65 శాతం, చెన్నూర్ బాలికల గురుకులంలో 97.40 శాతం, మందమర్రి బాలికల గురుకులంలో 98.68 శాతం, ఆసిఫాబాద్ బాలుర గురుకులంలో 97.22 శాతం, కాసిపేట బాలుర గురుకులంలో 98.53 శాతం, మంచిర్యాల బాలుర గురుకులంలో 97.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

'పార్టీల పేరుతో ఆదివాసీలను విభజించవద్దు'


మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాజకీయ పార్టీల పేరుతో ఆదివాసీలను విభజించవద్దని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెస్రం కోసుపటేల్, గేడం నిరంజన్, ఆత్రం ముకుంద్‌రావు, కొడప రాధాబాయి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బూర్స పోచయ్య బీఆర్‌ఎస్‌కు అనుబంధంగా ప్రకటనలు చేస్తూ ఆదివాసీ గిరిజనులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజనులు ఎవరికి వారు తమతమ పార్టీలలో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికి ఒకే ఒక పార్టీకి ఓటు వేయడానికి ముందుకు రావాలని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి రెండు రోజుల క్రితం బూర్స పోచయ్య 9 తెగల ఆదివాసీ గిరిజనులు బీఆర్‌ఎస్‌వైపు ఉన్నారంటూ ప్రకటన చేయడం సరికాదన్నారు. ఆదివాసీలు ఏ ఒక్క రాజకీయ పార్టీ వైపు ఆసక్తి చూపడం లేదని మంత్రి సీతక్క చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి కొందరు ఆమెను అనుసరిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు టేకం భీంరావు, కొడప నగేశ్, గొడిసెల భీమన్న, కొద్దు పటేల్, మడావి బాలాజీ, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో నాణ్యమైన విద్యాబోధన

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ ఆశ్రమ పాఠశాలల్లో 50 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ఇదే మాదిరిగా వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని ఆశ్రమాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పీవో అభినందించారు.

విధి నిర్వహణతోనే పోలీసులకు గుర్తింపు

- అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సూర్యకుమార్


ఎస్సైలను సన్మానిస్తున్న సూర్యకుమార్

నిర్మల్‌టౌన్: విధి నిర్వహణలో చూపిన పనితనమే పోలీసులకు గుర్తింపునిస్తుందని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సూర్యకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పట్టణ ఎస్సై బాలిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భైంసా పట్టణ ఎస్సై పిట్ట ఆమోస్, ఎస్బీ ఎస్సై విఠల్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరు ముగ్గురూ 42 ఏళ్లుగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఏవో యూనిస్, ఆర్ఐ శైలేందర్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మృతదేహంతో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన


ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ స్తంభం పైనుంచి కింద పడి మృతి చెందిన జూనియర్ లైన్‌మెన్ నడిగొట్టు పవన్ కళ్యాణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆ సమయంలో ఉద్యోగులు కార్యాలయ గేటుకు తాళం వేసి లోపల ఉండటంతో ఆవరణలోనే నిరసన చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అక్కడే బైటాయించారు. సాయంత్రం విద్యుత్‌శాఖ డీఈ, లైన్‌మెన్‌ల సంఘం నాయకులు వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రూ.10 లక్షల ఆర్థికసాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరగా లైన్‌మెన్‌ల యూనియన్, సంబంధిత లైన్‌మెన్ కలిపి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ఒప్పుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే విధంగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీఈ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

లైన్‌మెన్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అటెండర్స్ కాలనీకి చెందిన లైన్‌మెన్ సింగిడి సంటెన్నపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం బస్టాండ్ సమీపంలో రామకృష్ణాపూర్‌కు చెందిన జూనియర్ లైన్‌మెన్ పవన్ కళ్యాణ్ విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి మృతి చెందాడు. లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుని తండ్రి బుచ్చన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ కోఇన్‌చార్జీల నియామకం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కో ఇన్‌చార్జీలుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ నియామకమయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి వారిని నియమించినట్లుగా పేర్కొంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు, జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన పెంటూ గంగాధర్ (70) 2016 ఫిబ్రవరి 27న రోడ్డుపై వెళ్తుండగా శాంతినగర్‌కు చెందిన షేక్‌రహీముద్దీన్ అలియాస్ ఫయాజ్ బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. గంగాధర్ కుమారుడు పోతలింగం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్ కుమార్ నిందితుడికి తొమ్మిది నెలల సాధారణ జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

తునికాకు సేకరణకు వెళ్లిన వ్యక్తి మృతి

కడెం: తునికాకు సేకరణకు అడవికి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం గ్రామానికి చెందిన మోకిరాల బక్కన్న (55) ఆదివారం తునికాకు సేకరణ కొరకు గ్రామస్తులతో కలిసి కడెం మండలంలోని గంగాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం అల్లంపల్లి సమీపంలోని అటవి ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కడెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4.31లక్షల నగదు పట్టివేత

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ గ్రామ సమీపంలో మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.31 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భైంసా నుంచి మహారాష్ట్రకు వేర్వేరుగా కారుల్లో వెళ్తున్న రమేశ్ రెడ్డి వద్ద రూ.1.10 లక్షలు, నారాయణ వద్ద రూ.1.08 లక్షలు, ప్రకాశ్ వద్ద రూ.70 వేలు, సట్వాజీ వద్ద రూ.57 వేలు, ద్విచక్ర వాహనంపై కుభీర్‌కు వెళ్తున్న సంతోశ్ వద్ద రూ. 86 వేల నగదును పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మోదీ కృషితో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి జి.నగేష్


కుభీర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి జి.నగేష్

కుభీర్: ప్రధాని నరేంద్రమోదీ కృషితోనే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ సాధ్యమైందని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి జి.నగేశ్ అన్నారు. కుభీర్ మండలం పార్డీ(బి), కుభీర్‌లో మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్‌తో కలిసి పాల్గొన్నారు. నగేశ్ మాట్లాడుతూ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టలేకపోయిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తోపాటు అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. దేశం కోసం మన సంస్కృతి సంప్రదాయల రక్షణ కోరకు మోదీ ప్రభుత్వం రావల్సిన అవసరం ఉందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే బాసర – మహోర్ రైల్వేకోసం కృషి చేస్తానని చెప్పారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు కుభీర్ బస్టాండ్ నిర్మాణానికి ఎంపీ నిధులు ఇచ్చానని, ముథోల్ నియోజకవర్గానికి 2.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బీజేఎల్పీ నాయకుడు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల మోదీ పాలనలో దేశం 5వ ఆర్థిక శక్తిగా ఎదిగిదన్నారు. త్వరలో 3వ శక్తిగా ఎదుగుతుందని చెప్పారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇంతవరకు చేయలేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా దేవుళ్లపై ఒట్లుపెట్టి కాలం వెళ్లదీసున్నారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫాసిస్టు మూకలపై చర్యలు తీసుకోవాలి'

- పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీరాణి



మాట్లాడుతున్న ఝాన్సీరాణి

ఎదులాపురం: కాకతీయ యూనివర్శిటీలో ఆదివారం నిర్వహించిన లౌకిక విలువలు–సాహిత్యం అనే సదస్సుకు హాజరైన ప్రముఖ కవులపై దాడికి పాల్పడిన ఫాసిస్టు మూకలపై తగిన చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ రాణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేస్తూ మతోన్మాదంతో ఫాసిస్టు కార్యకలాపాలకు పాల్పడుతున్న బీజేపీ కాషాయ మూకలపై చర్యలు తీసుకోవాలన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల హక్కులు కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. భౌతికదాడులు పనరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను ఎంపీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకులు అందె మంగ, కళావ తి, జ్యోతి, హరిత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.37 లక్షల విలువైన గంజాయి కాల్చివేత


గంజాయిని దహనం చేస్తున్న ఎస్పీ

తలమడుగు: జిల్లాలోని 11 పోలీస్ స్టేషన్లలో నమోదైన 19 కేసుల్లో వివిధ సందర్భాల్లో పట్టుబడిన 150 కిలోల గంజాయిని మంగళవారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో దహనం చేశారు. గంజాయి విలువ సుమారు రూ.37 లక్షలు ఉంటుందని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్పీ గౌస్ ఆలం, సభ్యులు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీని వాస్, డీఎస్పీ కె.సురేందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కోర్టు అనుమతి తీసుకుని గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ కె.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, కే సు రేందర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌ఈ


పరిశీలిస్తున్న ఎస్‌ఈ చౌహాన్

జైనథ్: విద్యుత్ శాఖ ఎస్‌ఈ చౌహాన్ మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు సంబంధిత సబ్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ నగేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఆదిలాబాద్ నిర్మాతకు అరుదైన గౌరవం

- 'మా ఊరి పొలిమేర–2'కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు


ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్లతో దర్శక, నిర్మాతలు

జైనథ్: జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ నిర్మాత గౌరికృష్ణ, డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో శ్రీ కృష్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన మా ఊరి పొలిమేర–2 చిత్రానికి ప్రతిష్టాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే జ్యూరీ అవార్డ్ వరించింది. సత్యం రాజేష్, డా.కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి, అక్షత, బాలాదిత్య, సాహితి దాసరి, రవి వర్మ, చిత్రం శ్రీను ముఖ్య తారాగణంగా తెరకెక్కిన ఈ చిత్రం గతేడాది నవంబర్ 2న విడుదలై మంచి కలెక్షన్లు రాబట్టింది. కాగా మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 14వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రం హీరోయిన్ డా.కామాక్షి భాస్కర్లకు బెస్ట్ యాక్ట్రెస్ జ్యూరీ అవార్డ్ దక్కింది. చిత్ర దర్శక నిర్మాతలు ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ అందుకున్నారు.

బొలెరో బోల్తా.. పలువురికి గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై దేవాపూర్ అటవీ చెక్ పోస్టు సమీపంలో మంగళవారం బొలెరో వాహనం బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. జైనూర్ మండలానికి చెందిన వీరు శుభకార్యం నిమిత్తం సుమారు 22 మందితో మాహోర్‌కు బొలెరోలో బయలుదేరారు. మండలంలోని సీతాగోంది దాటాక దేవాపూర్ చెక్ పోస్టు సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. డ్రైవర్ అజాగ్రత్తతోనే ఘటన జరిగినట్లు సమాచారం. ఘటనపై పోలీసులను సమాచారం కోసం సంప్రదించగా అంతా క్షేమంగా ఉన్నారన్నారు. అయితే వాణిజ్యపరమైన అవసరాలకు వాడాల్సిన వాహనాలను జనాల రవాణాకు వాడుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ మంచిర్యాల మార్కెట్ రోడ్, ERO ఆఫీస్ బ్యాక్ సైడ్ న్యూ బిల్డింగ్ 2BHK, 1430 Sft, అన్ని వసతులతో అద్దెకు కలదు. సంప్ర : 9866217635, 9490968609 [HA-14311]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185057]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [H-799874]

www.sakshi.com

■ అర్జెంటుగా మూతపడ్డ కంపెనీకి వాచ్‌మేన్ సూపర్‌వైజర్ కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన. సర్ సిల్క్ కంపెనీ కాగజ్‌నగర్ జీతం: 6,000/- ఉచిత గృహ వసతి. కుటుంబంతో ఉండవలెను. సంప్ర।। 9440050036/ 7569783139/ 9491824592 [H-778765]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,